క్లుప్తంగా

క్రీడా మైదానం ప్రారంభం



ఇందుకూరుపేట: చదువుతో పాటు క్రీడలకూ విద్యార్థులు తగిన ప్రాధాన్యమివ్వాలని డిప్యూటీ డీఈఓ ఎస్వీ నాయక్ పేర్కొన్నారు. మండలంలోని నరసాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఖోఖో క్రీడా మైదానాన్ని శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రూ.15 వేల సొంత నిధులతో క్రీడా ప్రాంగణాన్ని తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్‌ను అభినందించారు. పోటీల్లో ప్రతిభ చూపి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కాంక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన



ఇందుకూరుపేట: చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జగదేవిపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు బ్రహ్మేశ్వరనాయుడు, కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. చేతుల శుభ్రతపై ఇందుకూరుపేటలోని గురుకుల పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ జనార్దన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళులు



కోవూరు: కేరళ మాజీ సీఎం, కమ్యూనిస్ట్ అగ్రనేత అచ్యుతానందన్‌కు పట్టణంలోని సీతా పోలయ్య భవనంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మామిళ్లపల్లి మోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. శేషయ్య, బుజ్జయ్య, సుబ్బారావు, అఫ్రోజ్, పెద్దన్న, సురేష్, మల్లికార్జునరెడ్డి, శివ, గోవర్ధన్, హరి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ ఉపసంహరణకు డిమాండ్

నెల్లూరు(అర్బన్): ఉలవపాడు మండలంలోని కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం ప్రభుత్వం సేకరించనున్న భూసేకరణ ప్రక్రియను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్‌చేసింది. ఈ మేరకు కలెక్టరేట్లో డీఆర్వో హుస్సేన్‌సాహెబ్‌కు వినతి పత్రాన్ని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మూలం రమేష్, నేత మాదాల వెంకటేశ్వర్లు తదితరులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. భూసేకరణకు వ్యతిరేకంగా 3500 మంది రైతులు అర్జీలను ఇచ్చారని, ఇంత వ్యతిరేకత ఉన్నా, ప్రభుత్వం కుట్రపన్ని మరోసారి గ్రామసభ నిర్వహించేందుకు పూనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తొలుత నిర్వహించిన గ్రామసభ తీర్మానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూములను అప్పగిస్తే వాటిపై ఆధారపడిన చిన్న, సన్న కారు రైతులతో పాటు వ్యవసాయ కూలీలు 15 వేల మంది రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భూసేకరణ ప్రక్రియను ఆపకపోతే అన్ని పార్టీలు, ప్రజలతో కలిసి ఉద్యమాలు సాగిస్తామని స్పష్టం చేశారు.

చీటింగ్ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): కారును కుదువ పెట్టి నగదు తీసుకొని.. బాడుగ పేరిట తిరిగి తీసుకెళ్లిన వ్యక్తిపై చీటింగ్ కేసును చిన్నబజార్ పోలీసులు శుక్రవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్టకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సాబీర్ వద్ద అభినవ్ అనే వ్యక్తి తన బంధువుల కారును గతేడాది కుదువపెట్టి రూ.2.5 లక్షలను తీసుకున్నారు. అనంతరం బాడుగకు వెళ్లొస్తానంటూ కారును నమ్మకంగా తీసుకెళ్లి తన బంధువులకు అభినవ్ ఇచ్చేశారు. దీనిపై సాబీర్ పలుమార్లు నిలదీయగా, త్వరలోనే చెల్లిస్తానని చెప్పారు. రోజులు గడుస్తున్నా, ఎలాంటి సమాధానం చెప్పకుండా.. నగదు చెల్లించకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. ఇటీవల బాధితుడు గట్టిగా నిలదీయడంతో బెదిరింపు చర్యలకు దిగారు. సాబీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఎస్సెన్నెల్ పెన్షనర్ల నిరసన ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): పెన్షనర్స్ వేలిడేషన్ చట్టాన్ని రద్దు చేసి.. ఎనిమిదో వేతన కమిటీని వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనను ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బీఎస్సెన్నెల్ పెన్షనర్లు శుక్రవారం నిర్వహించారు. సంస్థ నెల్లూరు కార్యాలయం నుంచి వీఆర్సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన జరిపారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. నేతలు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, జాన్ ఆంథోనీ, చంద్రమౌళి, శేఖర్‌బాబు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వారం రోజులు.. 8 దొంగతనాలు

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఆగని రాగి వైరు చోరీలు
- అల్లూర్తి, మర్రిపల్లి, తాటిపర్తి గ్రామాల్లో వరుస ఘటనలు
- కొత్తవి ఏర్పాటులో చిక్కులు



మినీ ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

పొదలకూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరు దొంగతనాలు ఆగడం లేదు. ఈ విషయాన్ని స్వయంగా సంబంధిత అధికారులే వెల్లడిస్తున్నారు. వారం రోజుల్లో మండలంలోని అల్లూర్తి, మర్రిపల్లి, తాటిపర్తి గ్రామాల్లో వరుసగా 8 దొంగతనాలు జరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులో ఉన్న రాగితీగలను ఎత్తుకెళ్లి అమ్ముకుంటున్నారు.

చాలా ఏళ్లుగా..

పొదలకూరు పరిసర ప్రాంతాల్లో చాలా ఏళ్లుగా ఈ తరహా దొంగతనాలు జరుగుతున్నట్లు తెలిసింది. గతేడాది ఏప్రిల్ నుంచి అధికంగా పొదలకూరు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో జరిగినట్లు అధికారులు తేల్చారు. ఇప్పటి వరకు 58 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగతనం చేశారు. స్తంభం నుంచి తొలగించి దానిని పగులగొట్టి అందులో ఉన్న రాగితీగను తీసుకెళ్లాలంటే విద్యుత్ పనులు చేసేవారై ఉండాలి. ఇలాంటి చోరీ ముఠాలో పనులు తెలిసిన వారు ఒకరుంటారనేది గతంలో పట్టుబడిన దొంగల ద్వారా తెలిసింది. మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నందున వరుసగా రెండు నుంచి మూడింటిని పగులగొడుతున్నారు.

ఎంతో కష్టం

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసే విషయంలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉద్యాన సాగు అధికంగా ఉన్న గ్రామాల్లో పంటలకు నీటిని పెట్టుకునేందుకు రైతులు విద్యుత్ మోటార్లపైనే ఆధారపడుతుంటారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్లను తరచూ పగులగొట్టి రాగివైరు చోరీ చేస్తుండటంతో కొత్తవి బిగించేందుకు సమయం పడుతుంది. ఇందుకోసం బాధిత రైతులు వెళ్లి విద్యుత్ అధికారులకు సమాచారం అందజేస్తే వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. పోలీసులు కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ అందజేస్తే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

తోటలు, పొలాల్లో ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతను రైతులే చూసుకోవాల్సిందిగా అధికారులు వెల్లడించారు. చోరీలు అధికమవుతున్న నేపథ్యంలో తమవంతు బాధ్యతగా తీసుకుని అప్రమత్తంగా ఉండాలంటున్నారు. ఎంతోకాలంగా చోరీలు జరుగుతున్నా దొంగల ముఠాను కట్టడి చేయలేకపోతున్నారు. ఇటీవల పొదలకూరు మండలం అమ్మవారిపాళేనికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. కొద్దిరోజులు చోరీలు ఆగినా.. తర్వాత మళ్లీ జరుగుతూనే ఉన్నాయి.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి.. తస్కరణకు గురైన వైరు (ఫైల్)

చొరవ చూపాలి

ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగి వైరు దొంగతనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. నాలుగు స్తంభాలకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ బోల్టులను వెల్డింగ్ చేయిస్తే చోరీ చేసేందుకు వీలుండదు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టాలంటే దొంగలు బోల్టులను ఊడదీయాల్సి ఉంటుంది. రైతుల సహకారం కూడా ఉంటే అదుపు చేయొచ్చు.

– శ్రీనివాస్, ఇన్‌చార్జి విద్యుత్ ఏఈ, పొదలకూరు

ప్రజల్లోకి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు



క్యూఆర్ కోడ్ పోస్టర్లను చూపుతున్న పూజిత, పార్టీ నాయకులు

- కాకాణి పూజిత

ముత్తుకూరు(పొదలకూరు): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత అన్నారు. ముత్తుకూరు పార్టీ కార్యాలయంలో శుక్రవారం రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టోపై మండల నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు జాప్యం చేస్తుండటాన్ని ఏవిధంగా ప్రజలకు వివరించాలో చెప్పారు. సర్వేపల్లి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తనను ముందుకు నడిపిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎన్ని జన్మలెత్తినా వారి రుణం తీర్చుకోలేనన్నారు. చంద్రబాబు వందల సంఖ్యలో హామీలిచ్చారని, వాటిలో ఒక్కటి కూడా సక్రమంగా నెరవేర్చలేదన్నారు. తల్లికి వందనం నగదు అరకొరగా బ్యాంక్ ఖాతాల్లో వేశారని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలే కాకుండా, ఇవ్వని హామీలను కూడా నెరవేర్చి చరిత్ర సృష్టించినట్టు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అక్రమ కేసులకు ఎవరూ భయపడేవారు లేరని, అండగా తమ కుటుంబం ఉంటుందన్నారు. ఎలాంటి సమస్య ఎదురైనా తనకు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. ప్రతి కార్యకర్త, నాయకుడు కూటమి మేనిఫెస్టోను ఇంటింటికీ చేర్చి వైఫల్యాలను వివరించాలన్నారు.

అధికారుల తీరుతో నష్టపోతున్నాం

- బీపీసీఎల్ ట్రాన్స్‌పోర్టర్ల ఆవేదన



నిరసన తెలుపుతున్న ట్రాన్స్‌పోర్టర్లు

వెంకటాచలం: అదానీ కృష్ణపట్నం పోర్టులోని భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) అధికారుల నిర్లక్ష్యం, బెదిరింపుల కారణంగా తీవ్రంగా నష్టపోతున్నామని బీపీసీఎల్ ట్రాన్స్‌పోర్టర్లు ఆరోపించారు. మండలంలోని పుంజులూరుపాడు వద్ద కృష్ణపట్నం రోడ్డుపై ట్రాన్స్‌పోర్టర్లు శుక్రవారం తమ లారీలను నిలిపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులతో మాట్లాడారు. అధికారులు రెండు సంవత్సరాల క్రితం ట్రాన్స్‌పోర్టర్లకు ఇచ్చిన హామీలను ఇప్పటికీ నెరవేర్చకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని చెప్పారు. కంపెనీ నుంచి రిటైల్ అవుట్‌లెట్లకు ఆయిల్‌ను తక్కువ ధరకే సరఫరా చేస్తున్నామన్నారు. ఆరునెలల తర్వాత ప్రత్యామ్నాయ రోడ్డు, గిట్టుబాటు భాడుగలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, వాటి గురించి ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం లేదన్నారు. కొందరు అధికారుల ధనదాహం కారణంగా నష్టపోతున్నట్లు ఆరోపించారు. ట్రాన్స్‌పోర్టర్ల సమస్యలపై కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పెట్రోలియం శాఖ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నెలకు 10 వేల కిలోమీటర్ల మేరకు లారీలు తిరుగుతాయని బీపీసీఎల్ కంపెనీ అధికారులు హామీ ఇవ్వగా, ప్రస్తుతం 5 వేల కిలోమీటర్లు కూడా తిరగడం లేదన్నారు. ఈ విషయంపై బీపీసీఎల్ అధికారులను ప్రశ్నిస్తే మీ వాహనాలను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్టర్లు లోకేష్, మస్తాన్ నాయుడు, సిద్ధయ్య, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



అవగాహన కల్పిస్తున్న సురేష్

కొడవలూరు: బాల్య వివాహాలతో అనర్థాలు సంభవిస్తాయని జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ పేర్కొన్నారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై నార్తురాజుపాళెంలోని సీబీఎస్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అయన మాట్లాడారు. బాల్య వివాహాలు చేసుకున్నా, ప్రోత్సహించినా శిక్షార్హులవుతారని చెప్పారు. ఎక్కడైనా ఇవి జరుగుతున్నాయని తెలిస్తే 1098 నంబర్‌కు సమాచారమివ్వాలని సూచించారు. గిరిజన పిల్లలకు ఆధార్ కార్డులను విధిగా చేయించాలని కోరారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం చెంచురామయ్య, ఉపాధ్యాయురాలు క్యాథరిన్, ఐసీసీపీ అధికారి రత్నం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు మంజుల, రాజమ్మ, సునీత, సుదర్శన, హెల్పర్ పోలేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం రేపు

పొదలకూరు: పదో తరగతి ఫలితాల్లో 450కు పైబడి మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు ఆదివారం జిల్లా గౌడ సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్‌హాల్లో నగదు బహుమతులను అందజేస్తామని ఆ సంఘం జిల్లా యువత అధ్యక్షుడు తాళ్ల రాజా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు రూ.5 వేలు నగదు, జ్ఞాపిక, విద్యా సామగ్రి ఇస్తారని తెలియజేశారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



కుషాల్

తోటపల్లిగూడూరు: జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు కోడూరు పంచాయతీ చెన్నపల్లిపాళేనికి చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. తేలిమేటి సునీల్‌కుమార్ కుమారుడైన కుషాల్ మర్రిపాడు మండలం కృష్ణాపురం నవోదయ విద్యాలయంలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఇటీవల కడపలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ – 14 టేబుల్ టెన్నిస్ పోటీల్లో కుషాల్ ప్రతిభ చూపాడు. ఈనెల 30వ తేదీ నుంచి తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలో జరుగనున్న నవోదయ విద్యాలయ టేబుల్ టెన్నిస్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

ఆన్‌లైన్‌లోనే పొదుపు లావాదేవీలు



మాట్లాడుతున్న ఈఎంటీ మునిభూషణ

మనుబోలు: పొదుపు మహిళలంతా ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు జరపాలని రాష్ట్ర ఈఎంటీ మునిభూషణ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలు, వీఓఏలకు నేషనల్ రూరల్ లైవ్లీహుడ్, లోకోస్ యాప్‌లపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సంఘాలంతా కలిసి దేశ వ్యాప్తంగా ఒకే పద్ధతిలో ఆన్‌లైన్‌లో లావాదేవీలు జరపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తాము 2023 నుంచే ఇతర రాష్ట్రాల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం వనజాక్షి, సీసీలు వెంకటేష్, రాజేశ్వరి, ప్రసన్నకుమారి, శ్రీనివాసులు, సీసీ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



జీవామృత తయారీ విధానాన్ని పరిశీలిస్తూ..

పొదలకూరు: పొదలకూరు సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వీహెచ్ఏలు, వీఏఏలు, ఏఈఓలు, ఎంపీఏలకు ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం కూడా శిక్షణ జరిగింది. రెండోరోజు క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఏడీఏ కె.శివనాయక్ ఆధ్వర్యంలో రాపూరు మండలం తూమాయి వద్ద ఉన్న వ్యవసాయ సేంద్రియ కేంద్రంలో జీవ ఉత్ప్రేరకాలు, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం మొదలైన అంశాలపై శిక్షణ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన శ్రీను

మనుబోలు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై శుక్రవారం బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. సైదాపురం గ్రామానికి చెందిన శ్రీను పని నిమిత్తం మోటార్‌బైక్‌పై నెల్లూరుకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. మండల పరిధిలోని బద్దెవోలు క్రాస్‌రోడ్డు సమీపంలో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం స్థానికులు అతడిని గూడూరుకు తరలించారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు



మనుబోలు: పూజలు చేస్తున్న మహిళలు



కొడవలూరు: విశేషాలంకారంలో కామాక్షితాయి



పొదలకూరు: వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

పొదలకూరు: శ్రావణ మాసం ప్రారంభమైన సందర్భంగా మొదటి శుక్రవారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మరుపూరు కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు జరిగాయి.

- మనుబోలు: స్థానిక విష్ణాలయంలో శుక్రవారం రాత్రి శ్రావణ మాస పూజలను వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు మాధవగిర హనుమాచార్యులు అమ్మవారికి మహాలక్ష్మమ్మ రూపంలో ప్రత్యేక అలంకరణ చేశారు. సామూహిక కుంకుమ పూజ జరిగింది.
- ఇందుకూరుపేట: గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరిదేవికి గాజులాలంకారాన్ని నిర్వహించారు. మూలవిరాట్, ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యేక పూజలను అర్చకులు అనిల్, రామకృష్ణ, కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నదానాన్ని మధ్యాహ్నం జరిపారు.
- కొడవలూరు(బుచ్చిరెడ్డిపాలెం): జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారికి లక్ష కుంకుమార్చనను వేడుకగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. పంచామృతాభిషేకం, పల్లకిసేవను జరిపారు. ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.
- విడవలూరు: మండలంలోని ముదివర్తి గ్రామంలో రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. రాజు – వసంత, గోపీ – పూజిత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



పొదలకూరు: మరుపూరులో..



ఇందుకూరుపేట: గాజులాలంకారంలో చాముండేశ్వరిదేవి



విడవలూరులో..

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- సింహభాగం ప్రజాప్రతినిధుల డుమ్మా



వివరాలను చదువుతున్న అధికారులు

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మన్నేపల్లి శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. అధిక శాతం ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. మండలంలో 13 మంది సర్పంచ్‌లు ఉండగా, వారిలో 12 మంది గైర్హాజరయ్యారు. ఒకరు మాత్రమే వచ్చారు. 11 మంది ఎంపీటీసీ సభ్యుల్లో ఐదుగురు గైర్హాజరు కాగా, ఆరుగురు హాజరయ్యారు. జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు కూడా రాలేదు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల్లో జరుగుతున్న పనులను చదివి వినిపించారు. ఎంపీడీఓ నారాయణ తన సందేశంతో సభను ముగించేశారు. మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరగడం, మండలంలోని ప్రధాన సమస్యలు చర్చకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

ఆత్మకూరు: లారీ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఘటన నెల్లూరుపాళెం సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. కృష్ణపట్నం పోర్టు నుంచి కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌కు ఐరన్‌ఓర్ లోడ్‌తో వెళ్తున్న లారీ నెల్లూరుపాళెం సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపుతప్పి జాతీయ రహదారి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్ నిద్రమత్తును వీడి ఒక్కసారిగా షడన్ బ్రేక్ వేయడంతో డివైడర్ మధ్యన వాహనం నిలిచిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై ఎస్‌కే జిలానీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రమాదం జరిగిన ప్రదేశానికి కొంచెం దూరంలో దుకాణాలు ఉన్నాయి. లారీ కొంచెం ముందుకొచ్చి దుకాణాలపైకి వచ్చి ఉంటే పెనుప్రమాదం జరిగి ఉండేదని దుకాణదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

వెంగమాంబకు రూ.24.68 లక్షల రాబడి



దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు ఆలయంలో హుండీ కానుకలను దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. గత నెల 20 నుంచి శుక్రవారం వరకు భక్తులు హుండీల్లో సమర్పించిన నగదు కానుకలను లెక్కించగా రూ.24,68,691 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వీ ఉషశ్రీ తెలిపారు. అలాగే ఆరు గ్రాముల బంగారం, 307 గ్రాముల వెండి కానుకలు వచ్చినట్లుగా వివరించారు. కోవూరు దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు, విశ్రాంత బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం, నర్రవాడ ఏపీజీబీ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.